# తథాస్తు దేవతలు

పందిట్లో పెళ్లి జరుగుతున్నది - ఆర్భాటంగా ఉన్నాయి ఎర్పాట్లు. పెండ్లి కూతురు నా క్లాసుమేటు సింధుజ. కార్డు ముక్క వస్తే - పాతస్నేహితులను కల్సుకోవచ్చని వచ్చాను ఆ ఊరికి..

అదొక పల్లెటూరు - బస్తీనుండి రావాలంటే బస్సు ఓరెండు గంటలు ప్రయాణం చేయాలి. బహుశ అందుకే నా మిత్ర బృందం రాలేదట్లుంది - అయినా కాలేజి చదువులు మానేసి పదేళ్లు దాటింది. ఎవరిదారి వాళ్లదయింది. పొట్ట చేత్తో పట్టుకుని అందరూ దేశం నలుమూలలా వెళ్లిపోయారు.

సింధుజ వాళ్లు బాగా రిసీవు చేసుకున్నారు - కూర్చోమన్నారు - కాని పెండ్లి ఏర్పాట్లలో బిజీ కాబట్టి నాకంటూ కంపెనీ యిచ్చేవాళ్లు కనపడలేదు.

అనవసరంగా వచ్చాను అని బాధపడుతున్న తరుణంలో నాదృష్టి ఓ మధ్య వయస్కుడు పైన పడింది. అతనూ ఒంటరిగా ఉన్నట్లున్నాడు - దిక్కులు చూస్తున్నాడు. అతని వైపు నడిచాను.

"నాపేరు గోపీచంద్.... " చెప్పాను.

"అయితే ఏంటిట?" అడిగాడు అతను.

నాకు తిక్కరేగింది కాని - సభ్యత కాదుకాబట్టి....

"అమ్మాయి తరపున వచ్చారా ? అబ్బాయి తరపునా ?" అడిగాను.

"ఏదో ఒకటి - అయితే ఏంటిట?" ఎదురు ప్రశ్న వేశాడు.

"మీపేరు తెల్సుకోవచ్చా ?" అడిగాను.

" వల్లకాట్లో రామనాథం - అయితే ఏంటిట?" అన్నాడు అతను.

" బాగుంది రామనాథం గారు - యింటి పేరు ఎలా వచ్చిండి ?" అడిగాను.

" గోంగూర పులుసు కాదూ - నాపేరు అది కాదు - అయినా నాపేరు నీకెందుకు చెప్పాలిట ?" అడిగాడు చికాగ్గా !

" అంత తెల్సుకోకూడదని పేరయితే చెప్పద్దులేండి . ఆజానుబాహువు -

అరవింద దళాక్షులు అయిన మీకు మీవాళ్లు ఎంత చక్కటి పేరు పెట్టారో తెల్సుకుందామని అడిగాను." చెప్పాను.

" అలాగా నాపేరు దామోదరం - ఇనిషియల్ 'డి'- అందరూ డొటింగు అంటారు కాని అది కాదు లే -- ఇంతకూ నీపేరు గోపీనా - ఛీ అదేం పేరు టోపీ లాగా - " చీదరించుకున్నాడు.

" అయ్యా ! నేనేం చేస్తాను చెప్పండి - నాకుగా ఆపేరు పెట్టుకోలేదు ఎందుకంటే అప్పుడు నావయసు నెలరోజులు కూడా లేదు - మీకు నచ్చలేదని యిప్పుడు పేరు మార్చాలంటే రూల్సు ఒప్పుకోవు. నా ఉద్యోగం ఊడుద్ది." చెప్పాను వినయంగా.

"సరేలేవయ్యా బోడి ఉద్యోగం - ఏం అఘోరిస్తున్నావు?" సదరు డి.దామోదరం అడిగాడు.

" ఏదో మీ దయవలన ఓ బీమా కంపెనీలో ధీమాగా బతికేస్తున్నానండి." చెప్పాను.

"భీమా సంగతి ఎత్తమాకయ్యా ! నాకు ఒళ్లు మండుద్ది ! చచ్చినోడికే లాభంట!" మండిపడ్డాడు.

"థ్యాంక్సండి - మీ అమూల్యమైన అభిప్రాయానికి - నాకు ఓ పదినిమిషాలు టైమిస్తే మీకు భీమా గురించి విపులంగా చెప్పి మీ డౌట్లన్నీ క్లియర్ చేస్తాను." విన్నవించుకున్నాను

" గాడిదగుడ్డు .... అస్సలు ఈ పెండ్లికి రావడమే నాకిష్టం లేదు - మా అమ్మాయి ఏడ్చి పోతుందని వచ్చాను. ఛీ ! ఛీ ! ఇంత అవకతవకల పెండ్లి నా జన్మలో చూళ్లేదు. ఓ సంప్రదాయం లేదు - ఓ ఆచారం లేదు - " విమర్శించ సాగాడు.

"పోనీలేద్దురూ - కాక కాక యిప్పటి కన్నా ఆమెకు పెండ్లి కుదిరింది - సంతోషిద్దాం -" చెప్పాను.

"అయినా ఈ వయసులో ఎందుకయ్యా పెండ్లి ! ఆడపిల్లకు ఇరవైలోగా

పెండ్లి అయి పోవాలి ! ఇప్పుడు చేసుకుని ఏం చేస్తుందిట !" చిర్రు బుర్రు లాడుతున్నాడు – దామోదరం.

"అది పూర్వకాలంలో లేండి – కనీసం యిప్పటికన్నా అయిందిగా సంతోషిద్దాం" చెప్పాను.

"సంతోషమా పాడా ! మొక్క అయి వంగనిది మానై వంగుతుందాని సామెత ఉంది కదా ! పదహారేళ్లకు పెళ్లి అయినా, పెళ్ళాం మొగుడి మాట వినడం లేదు. ఇ,క ముప్పయి దాటిన బాలకుమారి మొగుడి మాట ఏం వింటుంది? నాలుగు తన్ని తగలేస్తుంది.... ఛీ ! ఛీ ! ఏం పెళ్లిల్లో!" తేల్చేశాడు.

"మాష్టారూ – మీకు పెండ్లి అయిందా ?" అడిగాను.

"ఏదో అయిందిలే – ఒకటి – అయితే ఏంటిట !"

"అమ్మగారు క్షేమంగా ఉన్నారా?" సందేహిస్తూ అడిగాను.

"ఉండక ఊడుతుందా ? దానికేం నిక్షేపంగా ఉంది. అన్నీ భరించే భర్త ముండావాడ్ని నేనున్నాను కదా మరి." చెప్పాడు.

"ఆమెకు రెండు చేతులెత్తి నమస్కరిస్తున్నాను." చెప్పాను.

"ఏం పాపం ?" అడిగాడు.

"నిజంగా ఆమెకు సహనశ్రీ బిరుదు యివ్వాలండి." చెప్పాను.

"నువ్వు గాని ఏమన్నా ప్రజెంటేషన్ గాని పట్టుకొచ్చావా?"

"ఆ ! ఏదో చిన్నది లేండి – " నసిగాను.

"నాకు ఈ బహుమతులంటే – మతిపోతుంది – అయినా ఏం చేస్తారోయ్ ఈ బహుమతుల్ని – అందరూ ఓ ప్లాస్టిక్ కప్పో – ఓ స్టీలు చెంబో యిస్తారు – ఇల్లంతా ఒకటే చెత్త !" చెప్పాడు.

" పోనీ – ఓ వెండి గ్లాసో – ఓ బంగారు ఉంగరమో కొనివ్వచ్చుగా – అంతగా ఇవ్వాలంటే–" ఒళ్ళు మండి అడిగాను.

"బాగా చెప్పావు – నా మరదలు పెండ్లికే నే యిచ్చింది ఏంటో తెల్సా !

చెక్కతో చేసిన గోరంక చిలకల బొమ్మ - ఆమె నీలాగే అడిగింది - ఇదేంటి బావా ఇది తెచ్చావు అని - ఏంచెప్పానో తెల్సా - బంగారు ఆభరణం యిచ్చే స్థోమత నాకు లేదు - వెండి యిచ్చినా కొన్ని రోజుల్లో నల్లబడిపోతుంది - రాగి యివ్వకూడదు - కంచు - యిత్తడి ప్రజెంటేషన్‌కు బాగుండదు చిలుంపడుతాయి. స్టీలు కంచం వగైరాలు - శని అంశం - అది అస్సలు పనికి రాదు - ప్లాస్టిక్ యిద్దామంటే తొందరగా పోతుంది. అదే ఈ చెక్క బొమ్మకొన్నాననుకో దీన్ని గోడకేసి ఉంచుతావు నువ్వు అన్నా పోతావేమో కాని - ఇది మటుకు పోదు అని చెప్పేసరికి గమ్మున ఉండిపోయింది.” అభినయముతో వివరించాడు డి.దామోదరం.

“అరే ! భోజనాలు మొదలెడుతున్నట్లున్నారు. అప్పుడే జనం వెళ్లి పోయి కూర్చుంటున్నారు మీరు భోజనం చేస్తారా?” అడిగాను.

“నేను చాలా ప్రిన్సిపుల్డు మనిషినండి. ఒకవేళ పిలిస్తే పెళ్లి అన్నా మిస్సు అవుతానేమో కాని - భోజనానికి మటుకు రాకుండా మానను. అన్నం పరబ్రహ్మ స్వరూపం కదండి మరి అలాగే పెళ్లికి కూడా నోటి మాట ద్వారా పిలిస్తే రానండి.... కార్డు యిచ్చి మరీ పిలవాలి. మనం ఎక్కడ పోయినా జనం మర్యాద చేయాలి - మర్యాద ఆ !”

రెండో బ్యాచికి ఎంత తేడా వుంటుందో ఏమో నాకసలే అర్జెంటు పనులున్నాయి కాబట్టి - నేను వడివడిగా భోజనాల వైపు అడుగులేశాను, అతన్ని రమ్మని సైగచేస్తూ.

తీరా మేం వెళ్లే సరికి అన్ని సీట్లు అయిపోయాయి. ఆచివర్లో కొంచెం ఖాళీ ఉంటే రెండు ఛైర్లు వేయించుకుని కూర్చున్నాం ! డి.దామోదరం ఏదో చెబుతూనే ఉన్నాడు.

విస్తర్లు వేశారు - నీళ్ల గ్లాసులు పెట్టారు - ఒక్కొక్క వంట వాడు స్వీటు, కారా, వగైరాలు తెస్తున్నాడు.

“నిదానం - నిదానం - ఏంటా తొందర - రైలు ఏమన్నా పోతున్నదా - ఆ

స్వీటు యింకోటి వెయ్యి." అడిగాడు.

" అది తినండి – మళ్లీ వచ్చినప్పుడు వేస్తా." చెప్పి వంటవాడు వెళ్లిపోయిడు.

మిర్చీ బజ్జి వచ్చినప్పుడు రెండు వెయ్యమన్నాడు – వాడు గుడ్లురిమి చూసి 'ముందు అది తిను తర్వాత చూద్దాం.' అని వెళ్లి పోయాడు.

బిరియాని – వెజిటబుల్ బిరియాని – కమ్మగా ఉంది – ఇంకో గరిటె పెట్టమన్నాడు – కాస్త విదిలించాడు – దాంట్లోకి కుర్మా రెండు గరిటెలు అదనంగా వేయించుకున్నాడు భంగపోయి.

ఎవరూ మొదలెట్టకుండానే ఒక్కోటి రుచి చూస్తున్నాడు. నేను ఉండబట్టలేక అన్నాను అతని వంక విచిత్రంగా చూస్తూ.....

"డి.దామోదరం గారూ ! ఎలాగూ వాళ్లు సెకండు రౌండుకు వస్తారు గదా – అప్పుడు అడిగి పెట్టించుకో వచ్చు గదా !"

"మీకు తెలియదా – ఈ వంట వాళ్లు దొంగలు – పిల్లికి బిచ్చం పెట్టరు. వాళ్ల సొమ్ము దోచి పెడుతున్నట్లు శాంపిలుకు యిస్తున్నట్లు కూసింత పెడతారు – ఆనక రారు – మిగిలిపోతే అంతా రోడ్డు మీద పారబోస్తారు కాని – వచ్చిన అతిథులకు కడుపునిండా పెట్టరు."

"మీకా భయం అక్కర్లేదు – నేనున్నాగా పక్కన – అడిగి మరీ పెట్టిస్తాలేండి" చెప్పాను అన్నం కలుపుకుంటూ.

అతను తింటున్నాడు ఏదో చెబుతూనే ఉన్నాడు కొన్ని నేను ఆసక్తిగా వింటున్నాను, కొన్ని వినడం లేదు.

"అసలు నేను ఎంతో దురదృష్టవంతుడ్ని ! నాలాంటి దురదృష్టవంతులు ఎవరూ ఉండరు. పుట్టగానే తల్లిని పొట్టన పెట్టుకున్నాను – పుట్టక ముందే తండ్రిని మింగేశాను. మేనమామ వాళ్ల పంచన తిట్లు దీవెనలతో పెరిగాను. నన్ను ఆ వూరి వీధి బడిలో వేశారు – వెంటనే వరదలొచ్చి స్కూలు బిల్డింగు కొట్టుకు పోయింది. చెట్లకింద పాఠాలు చెప్పుకో వలసి వచ్చేది. హైస్కూలు పక్క ఊరిలో ఉండేది. సైకిలు

మీద పోతుండేవాడిని – కాని కొన్నాళ్లకు మా ఊరిపెద్దలకు వాళ్ళ ఊరి పెద్దలకు కొట్లాట పడి – మమ్మల్ని రానివ్వకుండా చేశారు.”

“దీంలో మీతప్పేముంది?” అర్థంగాలేదు నాకు.

“అంతే నంటావా ? తెనాల్లో మామామ నన్ను అనాథాశ్రమంలో చేర్పించి చదివించాడు– కాని నేను చేరగానే ఆ వార్డెన్ను పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లారు – లంచాలు మేశాడని – నేను కాలు పెట్టిన స్కూల్లో హెడ్‌మాష్టరు ఓ వారం రోజుల్లోనే గుండె ఆగి మరణించాడు. అలాగే డిగ్రీ చేశాను – నేరాసిన పరీక్షల రిజల్సు చాలా ఆలస్యంగా డిక్లేర్ అయ్యాయి – దాంతో ఒక అకడమిక్ యియర్ పోయి – పిజీ చెయ్యలేక పోయాను నేను రాసిన ఎ.పి.పి.యస్.సి పరీక్షలు అస్సలుకే కేన్సిల్ అయిపోయాయి.” ఆవేదనతో చెప్పాడు.

“సరే యింతకీ మీరు జాబ్ చేస్తున్నారు గదా – ”

“ఏదో బతకలేక బడిపంతులని వెలగబెడుతున్నా టీచరు పోస్టు – ఆ పిల్లలకు పాఠాలు చెప్పేకంటే పశువులకు చెప్పడం మేలు. మధ్యాహ్న భోజనం కోసం మాత్రమే యిస్కూలుకు తగలడతారు వాళ్లు–”

“మీకు పిల్లలు ఎంత మంది?”

“ఏదో లింగు లిటుకుమంటు ఓ నలుసు పుట్టింది.”

“చాల్లేండి – పెళ్లయింది కదా !”

“భలేవాడివే ! పెళ్లికాకుండా పిల్లలు ఎలా పుడతారయ్యా !”

“నేనడిగింది మీకు కాదండి – మీ నలుసుకు – ”

“ అబ్బే దానికిప్పుడు పెళ్ళికేం తొందర – పాతిక కూడా దాటలేదు దాన్ని కాస్త సుఖపడనియ్యి వయ్యా ! పెళ్లిలో ఏముంది బూడిద ! బానిసగా మొగుడు చెప్పింది చెయ్యడం తప్పించి – అందుకే అది బరి తెగించి ‘నాన్నా ! నాకు పెండ్లి చెయ్యి’ అని రోడ్డు మీద తిరిగేదాకా చెయ్యదల్చుకోలేదు – అయినా నా చెయ్యి ఎలాంటిది – దాని కాపురం సరిగా ఉండద్దు – నాకు పెళ్లికాగానే మామామగారు

హాంఫట్ అయ్యారు – ఈ నలుసు పుట్టగానే అత్తగారు వైకుంఠయాత్ర చేశారు." చెప్పాడు.

"మాగొప్ప జాతకురాలు – ముందు అన్నం తినండి సార్! అక్కడ పాయసం వడ్డిస్తున్నారు. ఆ పాయసం తిని మీకష్టాలు మర్చిపోండి."

"ఏం పాయసంలే – నాదాకా రావద్దు – మంది ఎంత మంది ఉన్నారు. నాకేం నమ్మకం లేదు – వాడు నాకుపోసే లోగా అయ్యేపోతుంది. "

"డోంట్ వర్రీ – అందరికీ వస్తుంది – చూడండి మన లైనులో మన దాకా వచ్చేస్తున్నాడు –" అంటుండగానే దగ్గరికి వచ్చేశాడు.

కాని .... దామోదరం పక్కవాడికి పోసి ఖాళీ బకెట్టు పట్టుకువెళ్లి పోయాడు. నేను ఆశ్చర్యపోయాను.

"అంతేనండీ! నామొహం మీద ఆ బ్రహ్మ ఆరాత రాశాడు." చెప్పాడు.

"పాయసం దేముంది – మళ్లీ తెస్తాడులేండి" అని చెప్పాను.

"ఏమో నాకు పోస్తాడనే నమ్మకం లేదు." అసంతృప్తిగా అన్నాడు. కాని, నిజంగానే ఇంకోతను పాయసం తెచ్చాడు – నాకు పోశాడు. దామోదరంకు పొయ్యమని చెప్పేలోగా వేరే లైనుకు వెళ్లిపోయాడు.

"చూశారా ! నా లెగ్గు మహిమ ! అంతే! అన్నీ నాదాకా వస్తాయి – అందకుండా పోతాయి. ఆఫీసరుగా సెలక్టు అయ్యాను – ఓబ్యాంకులో – తీరా వాళ్లు లిస్టు కాన్సిల్ చేశారు నాకు అప్పాయింటుమెంటు యిచ్చేలోగా. అస్సలు నేను పెద్ద సినిమా హీరో అవ్వాల్సింది తెల్సా – కాని నన్ను పెట్టి స్టార్ట్ చేసిన నిర్మాత అర్థాంతరంగా దివాళా తీసి – ఆ సినిమా మూలబడింది. దాంతో మళ్ళీ ఆ గుమ్మం ఎక్కలేదు." చెప్పాడు లేస్తూ.

పరవస్తు చిన్నయ్య సూరి చెప్పిన నిత్య దుఃఖితాల జాబితాలో ఈయన ఉన్నాడని గ్రహించాను.

ఇద్దరం వీడ్కోలు తీసుకుంటూ – అతని అడ్రసు నేను తీసుకున్నాను –

నాఅడ్రసు అతను తీసుకున్నాడు.

"మీకు వీలైతే ఓ మంచి పాలసీ తీసుకోండి" చివరగా చెప్పాను.

"నామొహానికి అంత అదృష్టమా ! పాపీ చిరాయువు అని చెప్పినట్లు నూరు సంవత్సరాలు బ్రతుకుతాను - మెచ్యూరిటీ క్లయిము వస్తుంది - నాకు నష్టం వస్తుంది... సుభ్రంగా ఆ డబ్బును ఏబ్యాంకులోనో వేస్తే బ్రహ్మాండమైన వడ్డీ వస్తుంది." అని చెప్పాడు.

కాల చక్రం గిర్రున తిరుగుతున్నది.

దామోదరాన్ని నేను మర్చిపోయి చాలాకాలమైంది.

ఓరోజు ఓశుభలేఖ వచ్చింది ఓఊరునుండి అది డి.దామోదరం నుండి - వాళ్లమ్మాయి పెండ్లట - మా ఊళ్లోనే !

బజారంతా గాలించి.... అతి కష్టంమీద చెక్కతో తయారు చేసిన చిలకగోరింక బొమ్మ కొనుక్కుని పెండ్లికి వెళ్లాను. కొంచెం ఖరీదు ఎక్కువే పెట్టాల్సి వచ్చింది.

పెండ్లి ఘనంగానే జరుగుతున్నది... కాస్త ఊపిరి పీల్చుకుందామని దామోదరం కిందకు రాగానే కల్సి అడిగాను.

"ఏంసార్ ! ఇంత చిన్న వయసులోనే అమ్మాయికి పెళ్లి చేస్తున్నారు?"

"ఏం చెయ్యమంటావు ముప్పై దాటితే ఎవ్వరూ చేసుకోరు - చేస్తావా - కిరసనాయిలు పోసుకొని చావమంటావా అని మా ఆవిడ బెదిరించింది. దాని కోసం ఏదో గంతకు తగ్గ బొంత అని చేస్తున్నా ! ఈ సంబంధం చేయడం నాకిష్టం లేదు - ఏదో సింపుల్ గా చేద్దామంటే - అన్ని ఖర్చులు వాళ్ళే పెట్టుకుని చేసుకుంటున్నారు." చెప్పాడు.

"మరింకేమండి - మీ అంత అదృష్టవంతుడు లేడు." అని అభినందించాను.

"భలే వారే ! అమ్మాయికి ఈ మధ్య మంచి కంపెనీలో మంచి జాబ్ వచ్చింది - నెలకు పాతిక వేలు శాలరీ ! కనీసం ఓ రెండేళ్లన్నా తినచ్చు అనుకుంటే ఈ వెధవ శనిలాగా వచ్చాడు. అల్లుడి రూపంలో - లవ్వుట లవ్వు ! అయినా ఎన్నాళ్ళో ఈ

కాపురం ? నేను చూస్తాను." పళ్లు నూరాడు.

"మాష్టారు.- మీకోసం ఎంతో కష్ట పడి వెతికి వెతికి కొనుక్కు వచ్చాను చిలకా - గోరింకల చెక్కపటం." అందిస్తూ చెప్పాను ఉత్సాహంగా.

ఎగిరి గంతేస్తాడుకున్న దామోదరం చప్పరించి పక్కకు ఓగిరాటు పెట్టాడు ఆబొమ్మని - నామనసు చివుక్కుమంది.

"బుద్ధి లేకపోతె సరి ! చిలకా - గోరింకలు ఎప్పుడన్నా జతకడతాయా ! అది వేరే జాతి - ఇది వేరే జాతి - ఇంటర్ క్యాస్టు మ్యారేజి కదూ - ఇంటర్ రెలిజియన్ మ్యారేజి కూడ. బుద్దిలేని కవులు వర్ణించడానికి , మీరు తేవడానికి చాలా బాగుంది." మటమటలాడాడు.

"పోన్లెండి సార్ - మీరు పాలసీ యివ్వకపోయినా - కనీసం అమ్మాయి - అల్లుడితో చేయించండి." ప్రాధేయ పడ్డాను.

"సరే ! నా మొహానికి అదొకటే తక్కువ ! మొన్నస్థలం అమ్మిన డబ్బు ఎక్కువ వడ్డీయిస్తారంటే ఓ బ్యాంకులో వేశానో లేదో - ఆ బ్యాంకు దివాలా తీసింది. ఆమధ్య మా ఆవిడకు జబ్బు చేసి ఛస్తుందని చెబితే - భయంవేసి ఓ పాలసీ తీసుకున్నా - తీరా ఆమెకు జబ్బునయమై నిక్షేపంగా ఉంది - ఆ ప్రీమియము చెల్లించలేక నేను ఛస్తున్నా !" చెప్పాడు గ్రేట్ డి.దామోదరం.

"సార్ ! ఎప్పుడూ అశుభం పలక్కండిసార్ ! పైన తథాస్తు దేవతలుంటారు - ఎప్పుడూ శుభం పలకండి." చివరగా చెప్పివచ్చేశాను.

ఓ వారం తర్వాత కామోసు పేపర్లో ఓ వార్త వచ్చింది.

తన ప్రేమ అంగీకరించలేదని చెప్పి ఓ కుర్రాడు - ఓ అమ్మాయిని స్కూల్లోకత్తితో పొడిచి చంపాడు. ప్రభుత్వం ఆ టీచర్ని సస్పెండు చేసింది. అతనెవరో కాదు డి.దామోదరం.

( ఆంధ్రప్రదేశ్ )